## భద్రత కల్పించడానికే కవాతు


నిజాంపేట మండలకేంద్రంలో పోలీసుల కవాతు

■ నిజాంపేట, నవంబర్ 1 : ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో అభద్రతా భావం తొలిగించి, రక్షణ కల్పించడానికే గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నార్లపూర్, కల్వకుంట, నిజాంపేట గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలతో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల కవాతు నిర్వహించామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడనికి కవాతు నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కవాతులో పోలీస్, కేంద్ర సిబ్బంది ఉన్నారు.

## సోషల్ టీచర్ దేవయ్యకు డాక్టరేట్


ఓయూలో డాక్టరేట్ పట్టా అందుకుంటున్న దేవయ్య

■ మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 1 : పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దేవయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. దేవయ్య జాతీయ ఉపాధి హామీ పథకంపై మెదక్ జిల్లాలో పరిశోధనలు చేశారు. బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 83వ స్నాతకోత్సవంలో ఆడ్‌బో సీఈవో పద్మశ్రీశాంతన్ నారాయణ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న దేవయ్యను ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

## డాక్టరేట్ అందుకున్న డిప్యూటీ కమిషనర్


మహేందర్‌రెడ్డి (ఫైల్)

■ రామాయంపేట, నవంబర్ 1 : మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన పరుపాటి మహేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన 83వ స్నాతకోత్సవంలో ఆడ్‌బో సీఈవో పద్మశ్రీశాంతన్ నారాయణ్ డాక్టరేట్ అందజేశారు. నస్కల్ గ్రామానికి చెందిన పరుపాటి మహేందర్‌రెడ్డి ఇంటర్ రామాయంపేటలో, హైదరాబాద్ డిగ్రి, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో కమర్షియల్ ట్యాక్స్ జీఎస్టీ డిపార్ట్‌మెంటులో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. ఓయూ ప్రొఫెసర్ కమలాకర్ పర్యవేక్షణలో 'తాత్విక గేయాలు, ఉపనిషత్తుల ప్రభావం'పై తెలుగులో పరిశోధనలు చేసిన శ్రీధర్‌రెడ్డి డాక్టరేట్ పట్టాకు ఎంపికయ్యారు. మహేందర్ రెడ్డికి డాక్టరేట్ పట్టా రావడంపై స్వగ్రామం నస్కల్‌లోని ఆయన కుటుంబీకులు సంబురాలు నిర్వహించారు.

## 4న పెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

■ మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 1 : పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 4న ఉమ్మడి మెదక్ జిల్లా పెన్సింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అండర్-14, -17 విభాగాల్లో బాలబాలికలకు పెన్సింగ్ క్రీడాకారులకు ఎంపిక పోటీలను చేగుంట మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలు ఒరిజినల్ బోనఫైడ్, ఇతర సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు.


నిజాంపేటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్టార్ పండిత్


కొల్చారం : వరిగుంతంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ ప్రభాకర్

# బీఆర్‌ఎస్‌తోనే రైతు సంక్షేమం

- ఇంటి ఎదుటనే ధాన్యం కొనుగోళ్లు
- కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర
- దళారులను నమ్మి మోసపోవద్దు
- జిల్లావ్యాప్తంగా ధాన్యం విక్రయాలు
- కేంద్రాలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు


తూప్రాన్ : ఇస్లాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో అరుంధతి

నర్సాపూర్/ కొల్చారం/ చిలిపిచెడ్/ నిజాంపేట/ వెల్దుర్తి/ తూప్రాన్, అక్టోబర్ 1 : బీఆర్‌ఎస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమని, రైతుల కోసం ఇంటి ఎదుట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధర ఇన్నదని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్, ఐకేపీ అధికారులు ప్రారంభించారు. నర్సాపూర్‌లోని మార్కెట్‌తోపాటు చిన్నచింతకుంటలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మెర్సినా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఏపీఎం గౌరీశంకర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మహిళా మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మమత, గీత, అకౌంటెంట్ మల్లేశం, ఆపరేటర్ సురేశ్, సీసీ ప్రవీణ, సీఏలు నాగరత్నమ్మ, లక్ష్మి, రైతులు రాజూయాదవ్, లింగం, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

**మద్దతు ధర కల్పించడానికే కేంద్రాల ఏర్పాటు**

**★ ఐకేపీ డీపీఎం జాన్ కెనడీ, సీఈవో రాములు**

కొల్చారం మండలంలోని పోతంశెట్‌పల్లి రైతువేదిక వద్ద ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఐకేపీ డీపీఎం జాన్ కెనడీ, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి ప్రారంభించారు. వరిగుంతం గ్రామంలో పీఏసీఎస్ కేంద్రాన్ని చైర్మన్ చిన్నారం ప్రభాకర్, సీఈవో రాములు ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర కల్పించడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముత్యంగారి సంతోష్‌కుమార్, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, ఏపీఎం సుసిల్వ, సీసీ తనూజ, సీఏలు నర్సింహులు, యాదగిరి, కార్యదర్శి అరుంధతి పాల్గొన్నారు.

**రైతులు ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలి**

చిలిపిచెడ్ మండలకేంద్రంతో పాటు చిట్కుల్, చండూర్, ఫైజాబాద్, సోమక్కపేట, అజ్జమర్రి తదితర గ్రామాల్లో సోమక్కపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను సీఈవో పోచయ్య, తహసీల్దార్ ముసాదీక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు ధాన్యం తెచ్చే సమయంలో ఆధార్‌కార్డు, బ్యాంక్ అంకౌట్ పత్రాలను తీసుకుని రావాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లుచేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు భూపాల్, రమ్య, ఉప సర్పంచ్ రాజ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు నరేందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, ఖాసీం, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాందేవ్, మల్లేశం, రమేశ్ పాల్గొన్నారు.

**ధాన్యంలో తేమ లేకుండా తీసుకుని రావాలి**

వెల్దుర్తి మండలంలోని మహ్మద్‌నగర్‌తండా, దామరంచ పంచాయతీ అక్కమ్మపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతుకు మద్దతు ధర అందించి ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యంలో తేమ లేకుండా పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తేవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు పూర్తికాగానే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీఏ భీమయ్య, డీపీఎంలు మోహన్, వెంకటేశ్వర్లు, ఏపీఎం శంకరయ్య పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

తూప్రాన్ మండలంలోని ఆరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో అరుంధతి ప్రారంభించారు. ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, వట్టూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం ప్రకాశ్, ఏపీఎం రుక్మిణి ఉన్నారు.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీవో ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్టార్ పండిత్ సూచించారు. నిజాంపేటతోపాటు రజాక్‌పల్లి, కల్వకుంట గ్రామాల్లో పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యంలో మట్టి, తాలు గింజలు లేకుండా రైతులు జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, కావేరి, సీఈవోలు శోభారాణి, గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ సహాయ కార్యదర్శి మహిపాల్ ఉన్నారు.



నర్సాపూర్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ మెర్సినా


వెల్దుర్తి : అక్కమ్మపల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్

# కొండాపూర్ అడవిలో వ్యక్తి హత్య

■ నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

నర్సాపూర్, నవంబర్ 1 : మండలంలోని కొండాపూర్ అడవి ప్రాంతంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. నోమన్ అనే వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన నోమన్, ఫరూక్ గతంలో తాగిన మైకంలో గొడవపడ్డారు. నోమన్ బీరు సీసాతో ఫరూక్‌ని కొట్టాడు. అనంతరం గాంధీ దవాఖానకు వెళ్లి చికిత్స చేయించుకొని ఇద్దరు రాజీకి వచ్చారు. ఈ క్రమంలో ఫరూక్ పగతో రగిలిపోయాడు. నోమన్‌కి ఫుల్‌గా మద్యం తాగించి, నర్సాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకొచ్చి, వెంట తెచ్చుకున్న కత్తితో నోమన్‌ని ఫరూక్ పొడిచి చంపాడు. అనంతరం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.


మృతుడు నోమన్(ఫైల్)